క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెదనందిపాడు: కొప్పర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయాలంలో సోమవారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. సర్పంచ్ సాతులూరి సురేష్, ఉప సర్పంచ్ ఏలూరి శ్రీకాంత్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు.

అధికారులు సహకరించాలి

పెదనందిపాడు : గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాలని ఎంపీపీ హెప్సిబా కోరారు. సోమవారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యల గురించి ప్రజా ప్రతినిధులు తెలిపారని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. పన్ను వసూలులో పెదనందిపాడు మండలం గుంటూరు డివిజన్‌లోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. వచ్చే సమావేశం నాటికీ ప్రజా ప్రతినిధులు తెలిపిన సమస్యలను పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు ఖాసీంబీ, సాంబ శివరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సాయిలీల, పలు శాఖాల అధికారులు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే లక్ష్యం

ప్రత్తిపాడు: మహిళాభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రత్తిపాడులో ఈ నెల 31న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సమక్షంలో ఆసరా సంబరాలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం అధికారులతో కలిసి సభా ఏర్పాట్లు, ప్రాంగణం వద్ద మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో మంచి నీరు అందుబాటులో ఉంచాలని, షామియానాలు ఎక్కువ విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలని ఏపీఎం జి.సురేష్ కుమార్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 42 వేల మంది డ్వాక్రా మహిళల ఖాతాల్లో రుణ మాఫీ నగదు రూ.108 కోట్లను ప్రభుత్వం జమ చేసిందన్నారు. పార్టీ నాయకులు దాసరి చెంచురామారావు, నిమ్మగడ్డ జనార్దన్, బూసి సుబ్బారావు తదితరులున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

మామిళ్లపల్లి(చేబ్రోలు): గుండెపోటుతో మృతి చెందిన మామిళ్ల పల్లి గ్రామానికి చెందిన సూదా వెంకట నర్సయ్య కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణ ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. మృతుని భార్య సుజాతకు రూ.10వేల నగదును సర్పంచ్ జాలాది యానాదిరావు అందించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్యూలైన్‌కు..రూ.లక్ష విరాళం



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ కోసం ఐరన్ గ్రిల్స్ ఏర్పాటుకు గుంటూరు ఏటీ అగ్రహారానికి చెందిన గూడూరు రామకృష్ణ, రమాదేవి దంపతులు లక్ష రూపాయల విరాళం సోమవారం అందజేశారు. నగదును ఏసీ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా వర్కర్లకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు మరింత సహాయ సహకారాలు అందించాలని ఏసీ కోరారు.

గడ్డిపాడు చర్చి వద్ద కొనసాగిన పోలీసు పికెట్



పెదకాకాని: మండలంలోని గడ్డిపాడు చర్చి వద్ద పోలీసు పికెట్ కొనసాగుతోంది. పోలీసుల కథనం ప్రకారం.. గడ్డిపాడులో ఆదివారం ఓ వ్యక్తి మరణించాడు. అంత్యక్రియలు జరగకుండానే ఆ ప్రాంతంలో ఉన్న పరిశుద్ధ పౌలు లూథరన్ దేవాలయం(చర్చి)లో పాస్టర్ పులిదిండి రాజు రోజూ మాదిరిగానే ప్రార్థనలు నిర్వహించాడు. చర్చి కమిటీలో సభ్యుడైన కొచ్చర్ల శోభన్‌బాబు పాస్టర్‌కు ఫోన్ చేసి చనిపోయిన వ్యక్తి మృతదేహం పక్కన ఉన్నప్పుడు ప్రార్థనలు ఎందుకు చేశావంటూ అసభ్యంగా మాట్లాడాడు. దీంతో పాస్టర్ రాజు పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రెండు నెలల క్రితం చర్చికి సంబంధించిన కమిటీని ఎంపిక చేసే విషయంలో వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదం తిరిగి పునరావృతమై చర్చి పాస్టర్, ఇరువురు కమిటీ పెద్దలు, వారికి వ్యతిరేకంగా మరో ముగ్గురు కమిటీ పెద్దలు వివాదానికి దిగడంతో ముందస్తు చర్యల్లో భాగంగా కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు సురేష్ బాబు తెలిపారు. ఇరు వర్గాల్లో 55 మందిని బైండోవర్ చేశారు. ఈ ప్రాంతంలో ఎటువంటి వివాదాలు, గొడవలు జరగకుండా పోలీసు పికెట్ కొనసాగుతోంది.

మహిళా సంక్షేమం..సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య



ద్వాక్రా మహిళలకు నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): మహిళా సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పొన్నూరులోని జగన్మోహనరావు కల్యాణ మండపంలో సోమవారం వైఎస్సార్ ఆసరా సంబరాలు జరిగాయి. పట్టణం, రూరల్ పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పొన్నూరు పట్టణ పరిధిలో రూ.9,73,91,669లు, రూరల్ పరిధిలో రూ.13,09,84,795లు వైఎస్సార్ ఆసరా నగదు చెక్కులను డాక్రా సంఘాలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సభకు మున్సిపల్ కమిషనర్ రాధారెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వావలంబన, మహిళా సాధికారతకు ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందన్నారు. రాజకీయ లబ్ధి పొందటానికి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నారని దుయ్యబట్టారు. పొన్నూరు పట్టణంలోని మహిళల సహకారంతో మహిళా సూపర్ కో-ఆపరేటివ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్ మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత, బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, ఉన్నతి, సున్నా వడ్డీ తదితర సంక్షేమ పథకాలు గతంలో ఏ ప్రభుత్వాలు ఇవ్వలేదని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుంటూరు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని కోరారు. ఎంపీపీ భవనం పద్మలీల, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శేషమాంబ, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సైపుల్లా, బొద్దులూరి రంగారావు, భవనం వంశీ రెడ్డి, ఆకుల రామ్మోహన్, దాసరి నారాయణరావు, షేక్ షర్మిల, మంద్రు అనిత, మోపర్తి ప్రమీల, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



మినీ ఫిష్ వెండింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలారి రోశయ్య

పొన్నూరు (చేబ్రోలు): స్పందన కార్యక్రమంలో అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పొన్నూరు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. తహసీల్దారు శ్రీకాంత్ కేదారినాథ్‌తో సమీక్షించారు. ఎంపీడీఓ శేషమాంబ, హెచ్‌వో పి.ఉష, ఈఓపీఆర్డీ శివ సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర యూనిట్ ప్రారంభం..

పొన్నూరు పట్టణ పరిధిలోని నిడుబ్రోలు జీబీసీ రహదారి మార్గంలో రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినీ ఫిష్ వెండింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిష్ ఆంధ్ర ద్వారా మహిళలు, యువత స్వయం ఉపాధి పొంది..ప్రజలకు మాంసం అందించడం జరుగుతుందన్నారు. ఫిష్ ఆంధ్ర యూనిట్లను ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించడంతోపాటు సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. గుంటూరు ఫిషరీస్ డీవో ప్రసాద్, నిడుబ్రోలు ఫిషరీస్ ఆఫీసర్ ఎం.ప్రశాంత్, మత్స్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: విద్యుత్ సబ్ స్టేషన్‌లో చేపట్టిన మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆ శాఖ డీఈ పీహెచ్ ఖాన్ తెలిపారు. ఎన్‌టీఆర్ మానస సరోవరం వద్ద సబ్ స్టేషన్‌లో లోడ్‌మీట్ ఆగేందుకు.. ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచేందుకు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లవారిపాలెంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు అంతరాయానికి సహకరించాలన్నారు.

నేడు పెదకాకానిలో 'ఆసరా' చెక్కుల పంపిణీ

పెదకాకాని: వైఎస్సార్ ఆసరా పథకం కింది డ్వాక్రా మహిళలకు రుణమాఫీ నగదు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పాల్గొననున్నారని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, స్థానిక నాయకులు, గృహ సారథులు హాజరు కావాలని ఎంపీపీ కోరారు.

భార్య అనుమానాస్పద మృతి కేసులో భర్త అరెస్టు

పెదకాకాని: ఈ నెల 8న నమోదైన భార్య అనుమానాస్పద మృతి కేసులో.. భర్తను సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం గడ్డిపాడుకు చెందిన వీరపనేని మహేష్‌కు.. తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన నవ్యతో నాలుగు నెలల క్రితం వివాహం అయ్యింది. మూడు నెలల గర్భిణి నవ్య, భర్త మహేష్ కుటుంబంతో కలిసి ఆటో నగర్‌లో బైండింగ్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మహేష్ దంపతులు బుధవారం మధ్యాహ్నం ఆటో నగర్ నుంచి ఇంటికి వచ్చి భోజనం చేశారు. మహేష్ తన తల్లిదండ్రులకు భోజనం తీసుకెళ్లగా.. కొంతసేపు నిద్రపోతానంటూ నవ్య ఇంటి వద్దనే ఆగిపోయింది. సాయంత్రం 4 గంటల సమయంలో మహేష్ మరదలు ఇంటికి వచ్చి గదిలో ఉన్న నవ్యను నిద్ర లేపేందుకు ప్రయత్నించింది. ఎంతసేపటికీ ఆమె పలకకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, విషయం చెప్పింది. ఇంటికి వచ్చిన భర్త తలుపులు పగులగొట్టి లోపల చూడగా అప్పటికే నవ్య ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. మృతురాలి తండ్రి శానం విజయేంద్రరావు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. భార్య ఆత్మహత్య చేసుకోవడానికి భర్తే కారణమని భావించి మహేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

కొనడం, అమ్మడం చంద్రబాబు రహస్యం

వైఎస్సార్‌సీపీ బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడు కోనూరు సతీష్ శర్మ



గుంటూరు రూరల్: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి విజయ రహస్యం కొనడం, అమ్మడమే అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడు కోనూరు సతీష్ శర్మ ఆరోపించారు. సోమవారం నగర శివారులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో గల తన కార్యాలయంలో ఆయన విలేకరుతో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు అంటే నమ్మక ద్రోహం, వెన్నుపోటు, నయ వంచన అని విమర్శించారు. చంద్రబాబు చరిత్ర అంతా కొనుగోలు రాజకీయమేనన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచింది చంద్రబాబేనని, ఓటుకు నోటు కేసులో దొరికింది ఆయన కాదా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి స్వార్థ రాజకీయాలకు పాల్పడ్డారని, తనను అవమానించారంటూ అసత్యాలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. శ్రీదేవికి తాడికొండ నియోజకవర్గంలో ఆదరణ తగ్గిందని.. ఆ విషయాన్ని పార్టీ అధ్యక్షుడు నేరుగా ఆమెకే చెప్పారని తెలిపారు. టికెట్ దక్కదని భావించి వైఎస్సార్ సీపీకి నమ్మకద్రోహం చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలను నమ్ముకున్నారని.. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా జగనన్న ధీటుగా ఎదుర్కొంటారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఏ ఒక్క కులాన్నో.. నమ్ముకోలేదని, జనాన్ని మాత్రమే నమ్ముకున్నారని విలువలతో కూడిన రాజకీయాలు చేయటమే ఆయనకు తెలుసునని స్పష్టం చేశారు. కుట్రలు కుతంత్రాలతో కూడిన చంద్రబాబు నాయుడుకి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని.. అప్పుడు చంద్రబాబు, టీడీపీ బంగాళాఖాతంలో కలవాల్సిందేనన్నారు.

వానపాముల ఎరువు తయారీపై శిక్షణ



శిక్షణ తరగతిలో పాల్గొన్న రైతులు

గుంటూరు రూరల్: విలువ ఆధారిత వానపాముల ఎరువు తయారీ ద్వారా రైతులు ఆరోగ్యకరమైన పంటలను పండించటంతోపాటు.. ఆదాయ మార్గాలు పొందవచ్చని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.వెంకటనాయుడు తెలిపారు. సోమవారం నగర శివారులోని లాంఫాం నందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు కేవీకే, హైదరబాద్‌కు చెందిన నారమ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వానపాముల ఎరువు తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కంపోస్టు, వానపాముల ఎరువుతో దీర్ఘకాలికంగా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. నారమ్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.బాలకృష్ణన్ మాట్లాడుతూ కేవీకే ద్వారా ఎస్సీ రైతుల అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ నిధులతో శిక్షణ తరగతులు నిర్వహించటం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కో-ఆర్డినేటర్, కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కేవీ సుబ్రమణ్యం, అగ్రానమీ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి, డాక్టర్ ఎస్.మధువాణి, డాక్టర్ ఎం.రత్నం, షేక్ అలీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొని యువకుడి దుర్మరణం



యువకుడి మృతదేహం

నారాకోడూరు(చేబ్రోలు): గుర్తు తెలియని మినీ లారీ ఢీ కొట్టడంతో బైక్‌పై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నారాకోడూరు గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగింది. నారాకోడూరు పరిధిలోని శ్రీనివాస చికెన్ స్టాల్ ఎదురుగా జీబీసీ రహదారిపై బైక్‌పై వెళ్తున్న యువకుడిని వేగంగా వెళ్తున్న మినీ లారీ ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆ యువకుడు అక్కడికక్కడే మరణించాడు. హెల్మెట్ ధరించినప్పటికీ యువకుడు తలపగలి ప్రమాద స్థలంలోని దుర్మరణం చెందాడు. మృతుడు తెనాలి చెంచుపేటకు చెందిన దిలీప్ అనే వ్యక్తిగా తెలుస్తోంది. గుంటూరు బెస్ట్ ప్రైస్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్డురాయి ప్రతిష్ఠ



పెదకాకానిలో ప్రతిష్ఠించిన బొడ్డురాయి

పెదకాకాని: భక్తిశ్రద్ధలతో బొడ్డురాయి ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి ఎంపీ నిధులతో పెదకాకాని ప్రధాన సెంటర్ నుంచి శివాలయం వరకూ రోడ్డు విస్తరణ, సెంట్రల్ డివైడర్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ అభివృద్ధి పనుల్లో బాగంగా తొలగించిన పెదకాకాని పాతూరు రోడ్డుపై బొడ్డురాయిని డివైడర్ వద్ద ప్రతిష్ఠించారు. మూడు రోజుల ఉత్సవాలను మొదటి రోజు విఘ్నేశ్వరపూజతో ప్రారంభించారు. నాదెండ్ల రామేశ్వర్ గురుకుల్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు, తీర్థ ప్రసాదాల పంపిణీ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

వేజండ్ల(చేబ్రోలు): ప్రమాదవశాత్తూ మట్టి ట్రాక్టర్ బైక్‌ను ఢీ కొట్టడంతో యువకుడికి కాలు విరిగి, తీవ్ర గాయాలైన ఘటన వేజండ్ల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన షేక్ షఫయతుల్లా ఉద్దీన్ ద్విచక్ర వాహనంపై వేజండ్ల అడ్డ రోడ్డు నుంచి గ్రామంలోకి వస్తుండగా ఎదురుగా వస్తున్న మట్టి ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో యువకుడి కాలు నుజ్జునుజ్జయ్యి.. విరిగిపోయింది. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆటో ఢీ కొని వృద్ధురాలికి..

చేబ్రోలు: ట్రాలీ ఆటో బైక్‌ను ఢీ కొన్న ఘటనలో వృద్ధురాలికి గాయాలైన ఘటన నారాకోడూరు గ్రామంలో జరిగింది. వడ్డి ముక్కల ప్రాంతానికి చెందిన వెంకట పద్మావతి ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు వెళ్తుండగా మార్గ మధ్యలో నారాకోడూరు జంక్షన్‌లోని మలుపు వద్ద ట్రాలీ ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెంకట పద్మావతి తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. వృద్ధురాలిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలి



హాల్‌టిక్కెట్లు అందజేస్తున్న డాక్టర్ సమత

పెదకాకాని: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని.. విజయం సాధించాలని సిబార్ దంత వైద్య కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ సమత పేర్కొన్నారు. ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పదవ తరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సమత మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని జయించి, ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. పాఠశాల అభివృద్ధికి రూ.25,000ల నగదు అందజేశారు. అలానే ఎంపీటీసీ ఎం.శ్రీనివాసరావు వంద ప్లేట్లు, సిద్దార్థ స్కూలు యాజమాన్యం 3 సీలింగ్ ఫ్యాన్‌లు పాఠశాలకు బహూకరించింది. సర్పంచి కె.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ టి.మరియదాసు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోజులో ఒకసారి.. చిరు ధాన్యాల ఆహారం ఆరోగ్యం



పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న తహసీల్దారు, ఎంపీడీఓ, సీడీపీఓ, ఏఓ తదితరులు

ప్రత్తిపాడు: రోజులో ఒకసారి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ప్రత్తిపాడు సీడీపీఓ వి సుజాతదేవి అన్నారు. పోషణ పక్షోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. పోషక విలువలున్న చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, తక్కువ ఖర్చుతో తయారు చేసిన పోషకాహార వంటలను ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ లీలా సంజీవకుమారి, ఎంపీడీఓ శ్రీరమ్య, సీడీపీఓ వి.సుజాతదేవి పాల్గొని, పోషకాహార ప్రదర్శనను వీక్షించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ రోజులో ఒకసారి చిరుధాన్యాలను తినడం ద్వారా బీపీ, షుగర్, గుండె జబ్బులను నియంత్రించి, ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. పెరటి తోటల పెంపకం వల్ల పురుగు మందుల అవశేషాలు లేని ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు తినవచ్చని పేర్కొన్నారు. చిన్న పిల్లలకు తల్లిదండ్రులు చిరుతిండ్లు పెట్టవద్దని, ఇంట్లో చిరు ధాన్యాలతో పిండి వంటలు చేసి తినిపించాలని సూచించారు. వేపుడు కూరలు కాకుండా ఆవిరి వంటలు తినడం, కాఫీ, టీ లకు బదులు రాగిజావ తాగడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎం.రత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతిరాణి, కరిమూన్, తిరుమల దేవి, నగరాజ కుమారి, మహాలక్ష్మి, నాసరమ్మ, వెంకాయమ్మ, అరుణ, రాజ్యలక్ష్మి, కమల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

- యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎన్ఎం అనిత పాల్గొన్నారు.
- పోషణ పక్షోత్సవంలో భాగంగా గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూపర్‌వైజర్ అరుణ ఆధ్వర్యంలో కిషోర బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐరన్, కాల్షియంతో కూడిన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కే అనిత బాల్య వివాహాలపై, ఏఎన్ఎం కళావతి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అక్కమ్మ, వెంకటరమణ, ద్వారక, దేవిక, కుసుమ పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి స్త్రీ నిధి రుణాలు



ప్రత్తిపాడు వైకేపీ కార్యాలయంలో సమీక్షిస్తున్న స్త్రీనిధి ఏజీఎం చెన్నకేశవులు

ప్రత్తిపాడు: డ్వాక్రా మహిళలకు లక్ష్యానికి మించి విరివిగా స్త్రీనిధి రుణాలు మంజూరు చేసినట్లు స్త్రీనిధి ఏజీఎం చెన్నకేశవులు తెలిపారు. ప్రత్తిపాడులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం స్త్రీనిధి రుణాల మంజూరు, రికవరీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాలకు స్త్రీనిధి రుణాల విషయంలో చాలా వ్యత్యాసం ఉందన్నారు. ప్రస్తుతం గ్రూపులో పది మంది ఉంటే ఏడుగురికి, అంత కన్నా ఎక్కువ ఉంటే తొమ్మిది మందికి రుణాలు ఇస్తున్నామన్నారు. గతంలో గ్రూపునకు రూ.2.5 లక్షల వరకే రుణం ఇచ్చేవాళ్లమని, ఆ మొత్తాన్ని ఇప్పుడు రూ.4.5 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ప్రత్తిపాడు మండలంలో లక్ష్యానికి అనుగుణంగా రూ.4 కోట్లు స్త్రీనిధి నుంచి రుణాలిచ్చామన్నారు. ఇంకా అర్హత ఉన్న వారికి ఈ నెలాఖరు వరకు రుణాలివ్వడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా గతేడాది స్త్రీ నిధి రుణాల రికవరీ 99.9 శాతం ఉందని, ఈ ఏడాది నూరు శాతం రికవరీ చేయనున్నట్లు చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. సమావేశంలో స్త్రీనిధి గుంటూరు క్లస్టర్ మేనేజర్ అమరావతి, ఏపీఎం జి.సురేష్‌కుమార్, సీసీలు పాల్గొన్నారు.

మార్జిన్ దాటితో చర్యలు తప్పవు..



దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు, ఎస్ఐ రవీంద్రబాబు

ప్రత్తిపాడు: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే.. కేసులు నమోదు చేస్తామని ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రత్తిపాడు ప్రధాన రహదారి ఆక్రమణలు తొలగించినా.. దుకాణదారులు తమ తోపుడు బండ్లు, తాత్కాలిక షెడ్లను రోడ్డు మార్జిన్ల వరకు ఏర్పాటు చేసుకుని వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. దీంతో ఎస్ఐ డి.రవీంద్రబాబు పాత మల్లాయపాలెం కూడలి నుంచి నిమ్మగడ్డవారిపాలెం సెంటరు వరకు సిబ్బందితో కలిసి దుకాణదారులతో మాట్లాడారు. బండ్లు, షెడ్లు వెనక్కు జరుపుకోవాలని ఆదేశించారు. రద్దీగా ఉండే సమయాల్లో వాహన పార్కింగ్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. నిత్యం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ చెప్పారు. ప్రత్తిపాడును గ్రీన్ ట్రాఫిక్ జోన్‌గా చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. బస్టాండు పరిసరాల్లోని దుకాణదారులతో సీఐ మాట్లాడారు. రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేస్తామంటే కుదరదని తేల్చిచెప్పారు.

ఆధునిక విద్యాబోధనతో విద్యార్థుల మేధస్సుకు పదును



విద్యార్థులతో ఆర్జేడీ సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక విద్యాబోధనతో విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టవచ్చని పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం అరండల్‌పేటలో కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, నెక్ట్స్‌జెన్ కిడ్స్ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికగా సన్నద్ధమవ్వాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ కె.శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ కాలానుగుణంగా విద్యాబోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి, విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈసందర్భంగా గతేడాది టెన్త్ పరీక్షల్లో 540కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రాలను బహూకరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీవిద్య, కేబీ సావిత్రి, నారాయణరావు, వైద్యులు తారక్‌నాథ్, ధనుంజయరావు, ప్రిన్సిపాల్ ఎస్.ఐజాక్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



యంత్ర పరికరాలను అందజేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

కొండపాటూరు(కాకుమాను): ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని పొన్నూరు ఏడీఏ తిరుమలాదేవి పేర్కొన్నారు. మండలంలోని కొండపాటూరు పోలేరమ్మ తల్లి (సీహెచ్‌సీ)గ్రూపు సభ్యులకు సోమవారం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుమలాదేవి మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యర్రాకుల కామేశ్వరి, ఏఓ కె.కిరణ్మయి, జీడీసీసీ బ్యాంకు మేనేజర్ నాగేంద్రబాబు, వీఏఏలు, రైతులు ఉన్నారు.